క్లుప్తంగా

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు ప్రదీప్‌కుమార్

ముమ్మిడివరం: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని ఎన్నికల పరిశీలకుడు ప్రదీప్‌కుమార్ సూచించారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించి కంప్యూటరైజ్డ్ ర్యాండమైజేషన్ నిర్వహించి అభ్యర్థులకు వివరాలు తెలియజేశారు. రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావు మాట్లాడుతూ అభ్యర్థుల ప్రచారం, పర్యటనలకు విధిగా అనుమతులు పొందాలన్నారు.

ఓటర్లకు భరోసా కల్పించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు రాజేశ్వర్ గోయల్

అమలాపురం రూరల్: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఓటర్లకు భరోసా కల్పించాలని సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి రాజేశ్వర్ గోయల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గోదావరి భవన్‌లో సూక్ష్మ పరిశీలకులుగా నియమించిన అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, పీఓలు, సెక్టార్ అధికారుల విధులపై సూక్ష్మ పరిశీలకులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు రాజేశ్వర్ గోయల్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సూక్ష్మ పరిశీలకుల నిఘా నేత్రంలో జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఓటర్లలో నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత సూక్ష్మ పరిశీలకులపై ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులతో పాటు అదనంగా వెబ్ కాస్టింగ్ వీడియో రికార్డింగ్ కూడా జరుగుతుందని చెప్పారు. జిల్లా పరిశీలకులు నిర్వహించే స్క్రూటినీలో సూక్ష్మ పరిశీలకుల రిపోర్టుల ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి డాక్టర్ శివశంకర్ ప్రసాద్, మాస్టర్స్ ట్రైనీ సాయిరాం, ఎల్‌డీఎం కె.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేద గణితంపై శిక్షణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో జిల్లా సత్యసాయి బాల వికాస్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణా తరగతుల్లో గణితావధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి విద్యార్థులకు బుధవారం వేద గణితంపై శిక్షణనిచ్చారు. సులభంగా గణిత పద్ధతులను అవపర్చుకునే విధానాలపై అవగాహన కల్పించారు. షోడశోపచార పూజ, గోపూజ విశిష్టత గురించి గాదె శ్రీనివాస్ వివరించారు. నీతి కథలు, శ్లోకాలపై విజయ శిక్షణ ఇచ్చారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల జోన్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్, జిల్లా బాల వికాస్ కేంద్రాల గురువు శిష్టా గుణరంజన్‌ల పర్యవేక్షణలో శిక్షణా తరగతులు జరుగుతున్నాయి.

డొక్కా సీతమ్మ పేరుతో అన్నదానం

అమలాపురం టౌన్: స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులు, వృద్ధులు, పేదలకు బుధవారం అన్నదానం నిర్వహించారు. తమ ఆరు ఆశ్రమాల ద్వారా రోజూ ఏదో చోట డొక్కా సీతమ్మ పేరుతో అన్నదానం నిర్వహించడం మూడేళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోందని యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో యోగాశ్రమంలో నడింపల్లి సుధీర, కార్యదర్శి చిరువూరి దుర్గ, కోశాధికారి నడంపల్లి దేవి, కనుమూరి షర్మిల పాల్గొన్నారు.

నీట్ పరీక్ష సెంటర్‌గా నవోదయ

యానాం: ఈ నెల 5న దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రతిష్టాత్మకమైన నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షకు స్థానిక యానాం జవహర్ నవోదయ విద్యాలయలో తొలిసారిగా పరీక్షా కేంద్రాన్ని కేటాయించారని బుధవారం ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే 123 మంది అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు సిటీ కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కేజే బేగం తెలిపారు. నీట్ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎస్పీ రాజశేఖరన్ నవోదయ విద్యాలయను బుధవారం సందర్శించారు.

80 శాతం పింఛన్ల పంపిణీ

ఉప్పలగుప్తం: మండల వ్యాప్తంగా 8056 మంది లబ్ధిదారులకు గాను రూ.23,68,90,000 నగదు అందజేయాల్సి ఉండగా, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో 6,087 మంది లబ్ధిదారులకు రూ.18,26,10,000 బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని ఎంపీడీవో కొరారి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం తెలిపారు. మిగిలిన 1,969 మంది లబ్ధిదారులకు రూ.5,42,80,000 నేరుగా సిబ్బందితో అందజేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ తొలిరోజు 80 శాతం పూర్తయ్యిందన్నారు. మిగిలినవారికి రెండు రోజుల్లోగా పూర్తి స్థాయిలో పింఛన్లు అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

అన్నదాతలకు ప్రభుత్వ భరోసా

- ఆర్‌బీకేల ద్వారా విస్తృత సేవలు
- సత్ఫలితాలనిస్తున్న సాగు విప్లవం



గాడిలంకలో రైతు భరోసా కేంద్రం

ముమ్మిడివరం: నాడు టీడీపీ ప్రభుత్వంలో రైతులు వారి సమస్యలను చెప్పుకోవడానికి చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకున్న నాథుడే కనపడలేదు. సాగు సమయంలో ప్రకృతి కరుణించి వర్షాలు పడినా పెట్టుబడి రుణాల కోసం రైతులు నానా అగచాట్లు పడేవారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారు. ఈ అడ్డంకులన్నింటినీ దాటినా ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చేసరికి దళారులతో ఇక్కట్లు తప్పేవి కాదు. నాటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు ఏకంగా వ్యవసాయం దండగని తేల్చేశారు. కాని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలబడి వ్యవసాయమంటే నూరేళ్ల పండగగా మార్చి చూపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలతో కలుగుతున్న లబ్ధి చూసి అన్నదాతలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకల సేవలు ఒక్క చోటే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంట్లో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని గ్రామ వ్యవసాయ సహాయకులుగా నియమించారు. స్థానికంగా రైతులకు ఏ సమస్య వచ్చినా సిబ్బంది స్పందించి పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. రైతులకు అవగాహన పెరిగేలా పొలం బడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు రాయితీపై అందిస్తున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర అందించి దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేశారు. రైతుకు సాగుకు ఉపయోగపడేలా యంత్ర పరికరాలు, డ్రోన్ స్ప్రేలు రాయితీపై అందిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి కోసం రైతు భరోసాగా ఏటా రూ.13,500 నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుంది. అలా ముమ్మిడివరం నియోజకవర్గంలో 24,050 మంది రైతులకు ఐదు విడతల్లో రూ.98.18 కోట్లు రైతు భరోసాగా అందించారు. ఉచిత పంటల బీమా పరిహారం రూపేణా 6,840 మంది రైతులకు రూ.29.15 కోట్లు ఇచ్చారు. వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీగా 757 మంది రైతులకు రూ.12.71 కోట్లు అందించారు.

ఆదుకుంటున్న రైతు భరోసా



ప్రభుత్వం ఏటా రైతు భరోసాగా అందిస్తున్న సాయం పెట్టుబడుల సమయాల్లో బాగా ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నాకు ఇప్పటివరకూ రూ.67,500 రైతు భరోగా జమ చేసింది. రైతులను సకాలంలో ఆదుకునే విధానం జగనన్న ప్రభుత్వంలోనే చూస్తున్నాం.
– కర్రి సత్యనారాయణ, రైతు, కర్రివానిరేవు

గత ప్రభుత్వంలో నిలువు దోపిడీ



గత ప్రభుత్వ హయాంలో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. దళారీలు నిలువు దోపిడి చేసి బస్తాకు రూ.800 నుంచి రూ.900 మాత్రమే చెల్లించేవారు. ప్రస్తుతం ఆర్బీకేల ద్వారా మద్దతు ధర అందిస్తున్నారు. అంతేకాదు అకాల వర్షాలతో పంట తడిసిపోయినా ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర అందిస్తున్నారు.
– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

ఆర్‌బీకేల ద్వారా రైతులకు మేలు



ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో వ్యవసాయం నిమిత్తం ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం గ్రామాల్లోనే అందుబాటులో ఉన్న ఆర్‌బీకేల్లో రైతుకు కావాల్సినవన్నీ సమకూరుతున్నాయి.
– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

నేడు పొన్నాడ ఎన్నికల ప్రచారం

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ కలిసి గురువారం పి.మల్లవరం గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు స్థానిక ధూళిపూడి గొల్ల బాబు కల్యాణ మండపం నుంచి ప్రచారం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం రవీంద్ర హైస్కూల్లో కవితా సంకలనంగా రూపొందించిన ఎన్నికల భారతం పుస్తకాన్ని ప్రముఖ రచయిత దాట్ల దేవదానం రాజు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిశ్రీ త్రినాథ్, వరప్రసాద్, జేవీఎల్ నరసింహరావులు తమ కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎస్.అబ్బులు, కోనసీమ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జగతా నరసింహరావు, జె.సత్యనారాయణ, ఎం.ఆశీర్వాదం, బి.సాంబమూర్తి, ఏవీవీ సత్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్ప గ్రామదేవత తిళ్లాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం మంగళవారం రాత్రి తిళ్లాలమ్మ ఆలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీ తాళాలు పగులగొట్టి సుమారు రూ.60 వేల నగదును అపహరించారు. చోరీ జరిగిన విషయాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మేనిఫెస్టోలో పేదల సంక్షేమానికి పెద్దపీట



ఎ.వేమవరంలో ప్రచార రథం పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



జనుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ఎ.వేమవరం, వేమవరంప్పాడు, జనిపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో ప్రచారం

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. బుధవారం ఆయన ఎ.వేమవరం, వేమవరంప్పాడు, జనిపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు పార్టీ నాయకులు, అభిమానులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక స్థితిగతులు మార్చారన్నారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సంక్షేమం కొనసాగాలన్నా మళ్లీ సీఎంగా జగన్ రావాలన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా జగన్ పరిపాలన కొనసాగుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వర బాబు, సర్పంచ్‌లు పందిరి విజయ, చెల్లుబోయిన నాని, సొసైటీ అధ్యక్షుడు గోర్తి సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ బొక్కా అదినారాయణ, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, కుమ్మరి రంగారావు, మట్టపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యాన్ని గెలిపించుకుందాం



పల్లంకుర్రులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పల్లంకుర్రు పంచాయతీలో ఎన్నికల ప్రచారం

కాట్రేనికోన: రాబోయే ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్న సంక్షేమ రాజ్యాన్ని గెలుపించుకుందామని ముమ్మిడివరం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పల్లంకుర్రు పంచాయతీ రామాలయం పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామాలయంపేట, మచ్చావారిపేట, ఐ.చెరువు, బూలవారిపేట, లైన్‌పేట, సాపేవారిపేట, పల్లంకుర్రు తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. పొన్నాడకు మహిళలు పూలు చల్లుతూ మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ అవ్వా, తాతలకు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛను ఇవ్వాలంటే జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించవలసిన బాధ్యత మహిళలు, సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులపై ఉందన్నారు. ఫ్యాన్ గాలికి రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, సర్పంచ్ నాతి అలివేణి, నాతి సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, ఏడిది సుబ్బారావు, కాశి మునికుమారి, జీటీ వెంకటేశ్వరరావు, చీకురుమిల్లి రత్నప్రసాద్, సాపే సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



రామాలయంపేటలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్





అమలాపురంలో బూత్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్, సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు

ఉప్పలగుప్తం: పార్టీ కార్యకర్తలంతా సైనికుల్లా పని చేసి గ్రామ స్థాయిల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి వైఎస్సార్ సీపీ విజయానికి పాటుపడాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన అమలాపురం మెండూరి కన్వెన్షన్ హాలులో ఉప్పలగుప్తం మండల బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించేది బూత్ కమిటీలేనన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రత్యర్థి పార్టీలు అనేక రకాలుగా బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ఏమాత్రం నెరవేర్చకపోగా దాన్ని మాయం చేశారన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించిన 2019 మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశారన్నారు. తాజాగా 2024 ఎన్నికల మేనిఫెస్టోను అంతకంటే మెరుగ్గా రూపొందించారన్నారు. మేనిఫెస్టోలోను ప్రతి బూత్ కన్వీనర్, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల వద్దకు తీసుకెళ్లి పూర్తి స్థాయిలో అవగాహన పరచి, జగన్ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఓటరుకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, బొడ్డు బుజ్జి, సర్పంచ్ సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, కుంచే రమణారావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, బీసీ,ఎస్సీ సెల్ అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, పోతుమూడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ పితానివారిపేట గ్రామానికి చెందిన సుమారు 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, కాశి లక్ష్మణస్వామి, పితాని అర్జున్, శెట్టిబలిజ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 14, 15 వార్డుల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ సమక్షంలో క్రాపచింతలపూడిపాలెం, రాయుడు పాలెం, గుబ్బలవారి పాలెంకు చెందిన సుమారు 200 మంది సానబోయిన మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా మేడే వేడుకలు



కార్మికుల ఐక్యతను చాటుతున్న ఉమ్మడి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు సత్తిబాబు, సత్తిరాజు



తాళ్లరేవులో కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అమలాపురం టౌన్: ఏఐటీయూసీ, ఆంధ్ర ఆటోవాలా వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కూడళ్లలో మేడే ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్మికులు మిఠాయిలు పంచిపెట్టుకుని పరస్పరం మేడే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హైస్కూలు, కలశం సెంటర్లు, వై.జంక్షన్, ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణం, నల్ల వంతెన, ఎర్ర వంతెన,ఈదరపల్లి వంతెన తదితర కూడళ్లలో మే జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు, ఆటో వాలా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్, రాయుడు ప్రసాద్, నెల్లి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ లిక్కర్ డిపో కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు జరిగాయి.

తాళ్లరేవు: ప్రపంచ కార్మికదినోత్సవాన్ని తాళ్లరేవు మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అత్తిలి బాబూరావు, వల్లు రాజబాబు, దుప్పి అదృష్టదీపుడు, ఎం.తణుకురాజు, విప్పర్తి శ్రీనివాస్, పి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద వివిధ కార్మిక, కర్షక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పెట్టా శివ మేడే జెండా ఆవిష్కరించారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణకుమార్, ఎస్.అజయ్‌కుమార్, వెంకటరమణ, రమేష్, రమణ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ప్రపంచ కార్మిక దినోత్సవం వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఐ.పోలవరంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. మురమళ్ల, ఎదుర్లంక, కేశనకుర్రు గ్రామాల్లో ఆటో యూనియన్లు, ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు, పారిశుధ్య కార్మికులు మేడే ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మేలు



అమలాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి

అమలాపురం టౌన్: గత ఐదేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ మేలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. అమలాపురం పట్టణంలోని 8, 12 వార్డుల్లో బేబీ మీనాక్షి, 18, 19 వార్డుల్లో డాక్టర్ శ్రీకాంత్ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌ను, మంత్రి విశ్వరూప్‌ను మళ్లీ గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు కట్టోజు సన్యాయ్యదాసు, గొవ్వాల రాజేష్, మాజీ కౌన్సిలర్లు సంసాని శ్యామలాదేవి, కాండ్రేగుల రేవతి, పట్టణ పార్టీ అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కముజు రమణ, ఉండ్రు బాబ్జి, కల్వకొలను ఉమ, దంగేటి రమణ, మంగళంపల్లి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారాన్ని అడ్డుకున్న గాడిమొగ గ్రామస్తులు



గాడిమొగ గ్రామంలో టీడీపీ ప్రచారాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

తాళ్లరేవు: టీడీపీ ప్రచారానికి మత్స్యకార గ్రామాల్లో సెగ తగిలింది. ముమ్మిడివరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు మత్స్యకార గ్రామమైన గాడిమొగ పంచాయతీకి వెళ్లారు. అయితే గ్రామానికి చెందిన కొందరు తమ ఊరిలోకి రావద్దంటూ టీడీపీ నాయకులను అడ్డుకున్నారు. ఆదేసమయంలో ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారానికి వెళుతుండడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం రేగింది. మాటల యుద్ధం కాస్తా పెరిగి ఒకరినొకరు తోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సైతం ప్రచారాన్ని అడ్డుకోవడం తగదని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ప్రచారాన్ని అడ్డుకున్నారని పలువురిపై టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సీనియర్ టీడీపీ నేత అడపా కృష్ణ రాజీనామా



అడపా కృష్ణప్రసాద్

అల్లవరం: గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాబలం కోల్పోయి ఘోరంగా ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు వ్యవహారశైలి టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను ఆవేదనకు గురి చేస్తుంది. ఈ నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు అడపా కృష్ణప్రసాద్ పార్టీ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. బుధవారం ఆయన గోడితిప్ప పంచాయతీ గోపాయిలంకలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచే పార్టీలో కీలకంగా వ్యవహరించానని, అయితాబత్తుల ఆనందరావు 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పార్టీలో సీనియర్లకు గుర్తింపు లేకుండా చేశారన్నారు. 2019లో ఓడిపోయిన ఆనందరావుని పరామర్శించేందుకు అల్లవరం మండలం నుంచి కొంతమంది సీనియర్ టీడీపీ నాయకులు వెళితే మీరెవ్వరూ కాపులకు పుట్టలేదా, మీ వల్లే ఓడిపోయానంటూ నీచంగా మాట్లాడారన్నారు. ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు దిందుకూరి సత్యనారాయణరాజుల ఒంటెద్దు పోకడతో పార్టీకి తీవ్ర నష్టం జరిగిందన్నారు. వారి వ్యవహారశైలి నచ్చకే 42 ఏళ్లుగా టీడీపీనే నమ్ముకుని ఉన్న తాను మనస్తాపానికి గురై పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశానని అడపా కృష్ణప్రసాద్ తెలిపారు.